క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత ప్రధానం

ఒంగోలు సబర్బన్: గ్రామ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని డీపీవో వెంకటేశ్వర రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు మండలం మండువారిపాలెం గ్రామాన్ని సందర్శించారు. సోర్స్ లెవల్లో చెత్త సేకరణ పద్ధతిని పరిశీలించి తడి చెత్త – పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని క్లాప్ మిత్రులకు సూచనలిచ్చారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను త్వరగా పూర్తి చేసి వాడుకలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువత, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ఆటల ద్వారా స్వచ్ఛత సందేశాన్ని ఇప్పించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీఓ రాజశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యం

ఒంగోలు మెట్రో: విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గద్దలగుంట మూడు బొమ్మల వద్ద గల ఏసీ కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్ ఆవరణలో చిన్నారులు ఆడుకోవటానికి ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రిని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ నియామకం

కొత్తపట్నం: మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలుగా అల్లూరు పంచాయతీ కార్యదర్శి కె.విజయ, ప్రధాన కార్యదర్శిగా ఈతముక్కల పంచాయతీ కార్యదర్శి బూచేపల్లి నారాయణరెడ్డి, గౌరవ సలహాదారుగా రాజుపాలెం పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరికొందరు సభ్యులను కూడా నియమించారు.

పంచాయతీలకు ఆదాయం పెంచాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు మెరుగుపరచుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులకు గ్రామ పంచాయతీ ఆదాయ పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయాన్ని పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నూరు శాతం ఇంటిపన్ను వసూలు చేయాలన్నారు. సంతలు, మార్కెట్ల నిర్వహణ ద్వారా ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్, రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి.బాలశివకుమార్ శుక్రవారం చంద్రపాడు గ్రామానికి చెందిన చిలిపి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు ఆ బ్యాంకుకు చెందిన ఇండియా ఫస్ట్ లైఫ్ బీమా చెక్కు అందించారు. ఇటీవల సుబ్బారెడ్డి మరణించగా, అతని కుటుంబ సభ్యులు ఈ నెల 18వ తేదీ క్లెయిమ్‌కు దరఖాస్తు చేశారు. వారం రోజుల వ్యవధిలోనే సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందించినట్లు శివకుమార్ తెలిపారు. బ్యాంక్ రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ధనవత్ బద్య చేతుల మీదుగా చెక్కు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఎరువుల గోడౌన్ ఏర్పాటుపై ఆందోళన



సమావేశం నిర్వహిస్తున్న సొసైటీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ఎరువుల గోడౌన్‌ను అద్దె భవనాలలో ఏర్పాటు చేయడంపై సిండికేట్ రైతు సేవా సహకార సంఘ సర్వసభ్య సమావేశంలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘ భవనం ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సొసైటీ చైర్‌పర్సన్ విజయమ్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే సొసైటీ ముందు గల ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా ఉందని, దానిని వాడుకలోకి తీసుకొస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సొసైటీలో రుణాలు, గోల్డులోన్లు, ఎరువులపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పొత్తుల అలంకరణలో ఒంగోలు కేశవ స్వామిపేటలోని వేపచెట్టు కనకదుర్గాదేవి అమ్మవారు



కంచికామాక్షిదేవి అలంకరణలో అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు



రూ.75 వేల విలువైన కరెన్సీ నోట్లతో చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అలంకరణ



సంతోషీమాత అలంకరణలో ఘంటాపాలెం పార్వతీదేవి



కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి

దయచూపమ్మా ధనలక్ష్మీ..!

ఒంగోలు మెట్రో: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఐదోరోజు జిల్లా వ్యాప్తంగా దేవాలయాలలో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎరుపు, పసుపు కలిసిన ఛాయతో ప్రకాశిస్తున్న అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. ఒంగోలులో వాసవీ అమ్మవారిని రూ.9,99,999 విలువైన కొత్త కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు. నగరంలోని అన్ని ఆలయాలలో అమ్మవారు ధనలక్ష్మి, మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు.

చీమకుర్తిలో రూ.5 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరణ...

చీమకుర్తి: చీమకుర్తిలోని పలు ఆలయాలలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక హరిహరక్షేత్రంలో అమ్మవారిని ఆలయ కమిటీ నిర్వాహకులు రూ.5 లక్షల విలువ చేసే కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు దర్శించుకొని పూజలు చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. చీమకుర్తి ఇసుకవాగులోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రూ.75 వేలతో అలంకరించారు. చీమకుర్తిలోని రెడ్డిబజార్‌లో 5 అడుగుల ఎత్తు కలిగిన అమ్మవారిని మహాలక్ష్మిగా పసుపుకొమ్ములు, కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు చేశారు.

మహాలక్ష్మీదేవి అలంకరణలో పార్వతీ అమ్మవారు...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతక స్వామివారి ఆలయంలో పార్వతీ అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఎండోమెంట్ ఏవో నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ ఉమమహేశ్వరావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, ఎలమందారావు మల్లేశ్వరి, ఉభయదాతలు పాల్గొన్నారు.



చీమకుర్తి రెడ్డిబజార్‌లో పసుపు కొమ్ములు, కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు



ఒంగోలు: గాయత్రీదేవి మందిరంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు



చీమకుర్తి హరిహరక్షేత్రంలో రూ.5 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు





శ్రీలక్ష్మీదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు





కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవి అలంకరణలో లాయరుపేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి, అమ్మవారికి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు





కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవి అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బూటకపు పాలకులకు బుద్ధి చెబుదాం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న చుండూరి రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీలు, వాటితో మోసం చేసిన పాలకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం మండలంలో మూడో రోజైన శుక్రవారం బీరంగుంట, గాదెపాలెం, ఆలూరు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ గ్రామాల్లోకెళ్లి పథకాలు వచ్చాయా.? అని అడిగినప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలే వచ్చాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. మహిళలకు నెలకు 1,500 ఇస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలిచ్చి ఆదుకున్నారని, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఓట్లేయించుకుని అరకొర పథకాలను కొంతమందికే ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. రైతులను దగా చేశారన్నారు. వ్యవసాయం మానుకుంటున్నా.. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. అనంతరం బాబు బూటకపు హామీలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంక పోతు అంజిరెడ్డి, పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, జెడ్పీటీసీ సభ్యురాలి భర్త రాంబాబు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటనారాయణ, మండల ఉపాధ్యక్షుడు తాతా నాంచారు, నాయకులు గాలి ముసలారెడ్డి, ఈతముక్కల ప్రసాద్, చంద్రశేఖర్, జజ్జర సాంబయ్య, పూనూరి శైలేష్, గాదె కోటిరెడ్డి, దొడ్ల రాజగోపాల్‌రెడ్డి, మల్లి కార్జున, తదితరులు పాల్గొన్నారు.

గిరిజమ్మకు చుండూరి నివాళులు



గిరిజమ్మకు నివాళులర్పిస్తున్న చుండూరి రవిబాబు

కొత్తపట్నం: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కేశవరపు రామలింగారెడ్డి సోదరుడు కేశవరపు ఆదినారాయణరెడ్డి భార్య గిరిజమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, వైవీ భద్రారెడ్డి, వైవీ హనుమారెడ్డి, వైఎస్సార్ సీపీ జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి, నాయకులు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఈతముక్కల మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, రాజీవ్, బచ్చల శివ, అనిల్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులతో కొద్ది సేపు మాట్లాడి ధైర్యం చెప్పారు.

నివాసాల మధ్య గ్రానైట్ ఫ్యాక్టరీలు నడపరాదు



ఎంపీడీఓ ప్రసాద్‌కి అర్జీ అందజేస్తున్న సృజన్

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివాసాల మధ్య గ్రానైట్ ఫ్యాక్టరీలు నడపరాదని, ఫ్యాక్టరీ నిర్వహణ కారణంగా గ్రానైట్ వ్యర్థాల వలన తీవ్ర అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్ అన్నారు. ఈ సమస్యపై శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్‌కు అర్జీ అందజేశారు. మాదిగపల్లిని ఆనుకుని ఉన్న శిఖాకొల్లి నరసింహస్వామి గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు, శబ్ద కాలుష్యం, ఫ్యాక్టరీ పరిసరాలన్నీ చిల్లచెట్లతో నిండి పాములు, తేళ్ల సంచారం ఉంటోందని తెలిపారు. ఫ్యాక్టరీలోని వృథా నీరు ఇళ్ల పరిసరాలు, ఇళ్ల గోడల వెంట నిలిచి దోమల ఆవాసాలు, మురుగు కేంద్రాలు తయారవుతున్నాయని తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజలు ఇక్కట్లకు గురి కాకుండా గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రతి ఇల్లు ఆరోగ్యంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మహేష్ కుమార్

కొత్తపట్నం: ప్రతి ఇల్లు ఆరోగ్యంగా ఉండే విధంగా వ్యాధులపై సర్వే చేసి గుర్తించాలని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మహేష్ కుమార్ సిబ్బందికి సూచించారు. స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఒంగోలు నుంచి సర్వే నేత్రాలయం వైద్య నిపుణులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కారాని జయరావు అధ్యక్షత వహించగా, మహేష్ కుమార్ మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్ ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, గర్భాశయ సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. 14 నుంచి 50 సంవత్సరాల మహిళల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, సీహెచ్‌వో ఓంకారం, సూపర్‌వైజర్లు ఇందిరాదేవి, సులోచనరాణి, పి.ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు (సీహెచ్‌వోలు), ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



జీజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానమని, మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ కోరారు. శుక్రవారం స్వస్థనారి శశక్త్ పరివార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి రక్తదానం చేసి మాట్లాడారు. రక్తదానం పట్ల అపోహలు విడనాడాలని సూచించారు. సకాలంలో రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనివలన ఎన్నో కుటుంబాలలో విషాదం నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ బ్యాట్లు అందజేత



హాకీ బ్యాట్లు, దేశ నాయకుల ఫొటో ఫ్రేమ్‌లు అందిస్తున్న శేషారావు, అన్నపూర్ణ, శ్రీనివాసరావు

కొత్తపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, జిల్లా ట్రెనింగ్ కమిషనర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కొణిజేటి వెంకటేశేషారావు, ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ పాఠశాలకు రూ.30 వేల విలువ చేసే హాకీ బ్యాట్లు, రూ.10 వేల విలువ చేసే 15 దేశ నాయకుల ఫొటోఫ్రేమ్‌లను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాకీ కోచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో హాకీలో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హాకీ క్రీడ అనేది మంచి క్రీడని, ఆరోగ్యానికి బాగుంటుందని అన్నారు. హాకీని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సాయ కిషోర్, ఫయాజ్ పాల్గొని హాకీ బ్యాట్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, పెద్దలు వారిని అభినందించారు.

రైతులకు నష్టపరిహారం అందించండి

- ట్రాన్స్‌కో అధికారులతో ఒంగోలు ఇన్‌చార్జ్ ఆర్డీవో కళావతి

ఒంగోలు సబర్బన్: విద్యుత్ టవర్ లైన్ల కింద నష్టపోతున్న రైతులకు నష్టపరిహారమిచ్చి టవర్ల నిర్మాణం చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు ఒంగోలు ఇన్‌చార్జ్ ఆర్డీవో కళావతి సూచించారు. స్థానిక తన చాంబర్‌లో ట్రాన్స్‌కో, రెవెన్యూ, చీమకుర్తి, పొదిలి, తాళ్లూరు మండలాల రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చీమకుర్తి మండలానికి చెందిన రైతు కేబీ మల్లికార్జునరెడ్డి ట్రాన్స్‌కో విద్యుత్ హై టెన్షన్ లైను వల్ల రైతులు నష్టపోతున్న విధానాన్ని ఆర్డీవోకు వివరించారు. రైతులకు ఆరు రకాల నష్టపరిహారాలు రావాల్సి ఉందన్నారు. దాంతో పాటు 2019లో ప్రారంభించిన విద్యుత్ టవర్ల లైన్‌ను ఇప్పుడు నిర్మిస్తూ ప్రస్తుత భూముల ధరల ప్రకారం ఇవ్వాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. దాంతో ట్రాన్స్ కో అధికారులతో పాటు మూడు మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో చర్చించారు. రైతులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే వారి అంగీకారంతోనే విద్యుత్ లైన్లు వేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఒంగోలు సిటీ: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక శాఖ సంచాలకురాలు పి.యామిని అమ్మాజీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగను పూల పండుగగా చేసుకుంటారని, ప్రకృతి ఆరాధన దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రత్యుత్పత్తికి సాక్ష్యాలైన పూలు స్త్రీలకు ప్రతీకలని, అటువంటి పూల పండుగను ఆనందంగా జరుపుకుని ఆ బతుకమ్మ వంటి పవిత్రతను, సౌందర్యాన్ని గొప్ప భవితను పొందాలంటూ బతుకమ్మ ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులందరూ కలిసి పేర్చిన బతుకమ్మలను చక్కని ముగ్గు మధ్యన నిలిపి వలయాకారంగా నిలిచి చప్పట్లు చరుస్తూ బతుకమ్మ పాటలకు ఆనందంగా నర్తించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర, సాంకేతిక సహాయక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. అంతర రాష్ట్ర సాంస్కృతిక కార్యక్రమంగా ఇది నిలుస్తుందని ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారి సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజలను ఇబ్బందిపెడుతున్న హిజ్రాలకు కౌన్సిలింగ్

ఒంగోలు టౌన్: నగరంలో రోడ్ల మీద కాపుకాసి మోటారు బైకులు, కార్లు, లారీలకు అడ్డంగా నిలబడి హిజ్రాలు డబ్బు వసూలు చేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేయడమే కాకుండా ఎవరైనా చిల్లరలేక డబ్బులివ్వకపోతే వారిని తీవ్రంగా వేధిస్తున్నారు. హిజ్రాల నుంచి తప్పించుకునే క్రమంలో కొన్ని సార్లు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. కొప్పోలు ప్రాంతంలో ఈ బెడద ఎక్కువగా ఉన్నట్లు బాధితులు వాపోతున్నారు. రాత్రయితే చాలు.. హిజ్రాల బెడద ఎక్కువవుతోందని కొందరు బాధితులు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి పోలీసు సిబ్బందిని రంగంలోకి దించి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. త్రోవగుంట నుంచి నాగులుప్పలపాడు వెళ్లే మార్గం, కిమ్స్ హాస్పిటల్ పరిసరాలు, మార్కెట్ యార్డు, మామిడిపాలెం చెరువు, ఒంగోలు టౌన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు.. కొంతమంది హిజ్రాలను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.